# 2

# మర్యాదలు వచ్చేస్తున్నాయి జాగర్త

మ్యారేజి హాలు ముందు ఆగింది టాక్సీ. హమ్మయ్య అనుకున్నాం. ఎక్కడా ట్రాఫిక్ జామ్ లేదు కాబట్టి త్వరగానే ఇంట్లోంచి బయలుదేరిన గంటన్నరకే గమ్యం చేరుకున్నాం.

"ఇక్కడ దగ్గర్లోనే పార్క్ చేసుకో డ్రైవరు బాబూ" అని అతని సెల్ నెంబరు నోట్ చేసుకున్నాం.

ఈ మధ్య ఎక్కడికెళ్ళినా టాక్సీ పిలిపించుకుంటున్నాం. డబ్బుపోయినా తిరిగొచ్చేటప్పుడు ఆటో దొరుకుతుందో లేదో అనే టెన్షనుండదు టాక్సీలో వెళ్తే.

ఆ కల్యాణ మండపంలో నాలుగైదు హాల్సున్నాయి. మేము వెళ్ళాల్సిన ఫంక్షను ఏ హాల్లోనో ఒకటికి పదిసార్లు చూసుకుని అటు వెళ్ళాం. ఎందుకంటే ఆ మాత్రం జాగర్తపడకపోతే ఇబ్బందులు ఎదురవుతాయి.

అదివరకు ఒకసారి అలాగే పెళ్ళికి వెళ్ళి లోపల కూర్చున్నాం. వాకిట్లో వాళ్ళు పన్నీరు జల్లి గులాబీ పువ్వులిస్తే పుచ్చుకున్నాం. వెల్‌కమ్ డ్రింకు ఇస్తే తాగాం. మనకు పరిచయమైన మొహాలు ఎక్కడైనా కనిపిస్తాయో అని వెతుకుతుంటే, స్టేజిమీద నుండీ సుముహూర్తే సావధానా, సులగ్నే సావధానా అని వినిపిస్తుంటే మా వారికి అనుమానం వచ్చింది.

"అదేవిటీ? ఇప్పుడు సావధానా సావధానా అంటున్నారు?" అని అడిగారు.

"మరి ముహూర్తం సమయంలో సావధానా సావధానా అనక అష్టవర్షాభవేత్కన్యా అంటారా?" అని అడిగాను.

"నువ్వో అయోమయం మేళానివి. ఇప్పుడు రిసెప్షన్ కదా జరగాలి. మనం వేరే పెళ్ళికి వచ్చినట్టున్నాం" అన్నారాయన.

నిజమే. స్టేజీ మీద కూడా ఒక్క తెలిసిన మొహమూ లేకపోవడమేమిటి? అంటే వేరే హాలుకొచ్చేశాం. "పొరబాటున ఇటొచ్చేశాం పదండి వెళ్దాం" అన్నా. ఇద్దరం లేచి బయటికొచ్చేశాం.

ఒకే ఆవరణలో ఒకటికంటే ఎక్కువ మండపాలుంటే అదో గండకత్తెర. ఫలాని వారి పెళ్ళి పిలుపు అని వుంటే ఫర్వాలేదుగానీ కేవలం వధూవరుల పేర్లు మాత్రం వేసి వూరుకుంటే కాస్త కష్టమే కదా పోల్చుకోటం. చేతిలో శుభలేఖ వుంటే బావుంటుంది.

శుభలేఖ తీసుకునే బయలుదేరదామనుకుంటాం గానీ ఆఖరి క్షణంలో హడావుడై పోతుంది.

ఇంట్లోనే మర్చిపోతాం. లేదా గమ్యం చేరాక టాక్సీలోనైనా వదిలేస్తాం.

రామక్రిష్ణగారి అబ్బాయి పెళ్ళి అనో, భారతిగారి అమ్మాయి పెళ్ళి అనో బయలుదేరుతాం గానీ పిల్లల పేర్లు ఎవరికి గుర్తుంటాయి? ఎప్పుడో పిల్లల బారసాలకి వెళ్ళటం మళ్ళీ వాళ్ళ పెళ్ళికి వెళ్ళటం. మహా అయితే మధ్యలో మరోసారి వెళ్తాం వాళ్ళింటికి. అంతకు మించి సంబంధాలూ వుండవు. రాకపోకలు అసలే వుండవు.

పెద్దతరానికీ పిల్లల తరానికీ వుండే అనుబంధం ఏనాడో ఆవిరైపోయింది.

కాబట్టి పిల్లల పేర్లని గుర్తుంచుకోటం అసాధ్యం.

ఆ వేళ మా విషయంలోనూ అదే జరిగింది. కార్డు కార్లో వుండిపోయింది. పెళ్ళి కొడుకు పేరు ప్రబంధ్. అది గుర్తుపెట్టుకున్నాను. "ఆ పిల్లాడి పెళ్ళి మేడమీదనే అని బోర్డుమీద బాణం గుర్తు వేశారు" అన్నారాయన.

"మధ్యలో మరో బోర్డు వుందేమో బాణం గుర్తువేసి చూద్దాం పదండి" అన్నా. వెతికితే ఆ హాలు కనిపించింది. అలా ఇంకోళ్ళింట్లో పెళ్ళికెళ్ళిపోయినందుకు మొహమాటం వేసింది గానీ పోన్లే వెల్‌కమ్ డ్రింక్ తాగగానే నిజం బయటపడింది. భోజనం కూడా చేసేశాక తెలిసివుంటే ఇంకా బాధపడే వాళ్ళం అనుకున్నాం.

ప్రస్తుతం ఈ పెళ్ళిలో ఇబ్బంది కలక్కుండా హాలు బయట బేనర్లమీద వధూవరుల ఫోటోలు, వాళ్ళిద్దరి తల్లిదండ్రుల ఫోటోలూ వున్నాయి. మా భానుమతి ఫోటోవుంది. ఆవిడ కొడుకు పెళ్ళికే వచ్చాం మేము. వాళ్ళు మాకు దూరపుబంధువులు.

లైట్లు, అలంకరణ కళ్ళు చెదిరిపోయేలా వున్నాయి. గేటు దగ్గరే నా చెయ్యందుకుంది అక్కడున్న అమ్మాయి. "ఇప్పుడా పిన్నిగారూ రావటం!" అంది ఆప్యాయంగా. ఆ ఆప్యాయతకి ప్రాణం లేచి వచ్చింది. ఈ రోజుల్లో ఈ మాత్రం పలుకరింపులెక్కడున్నాయి?

"మీ ఆరోగ్యం ఎలా వుంది బాబాయిగారూ?" అని మా వారిని పలుకరించింది.

"బాగానే వుందమ్మా. ఆ మధ్యన కాస్త తేడా చేసింది. ఇప్పుడంతా ఓ.కే." అన్నారు ఆయన.

"లోపలికెళ్ళి కూర్చోండి" అంది.

వెళ్ళి కూర్చున్నాం. ఆ అమ్మాయెవరో ఎంత తన్నుకున్నా గుర్తురావటం లేదు.

"ఏవండీ ఆ అమ్మాయెవరూ?" అని ఆయన్ని అడగబోయి మానేశాను. అడిగినా ప్రయోజనం లేదు.

మా ఇద్దరికీ ఈ మధ్య మతిమరుపు ఎక్కువై పోయింది. ముఖ్యంగా మనుషులను గుర్తుపట్టటం చాలా కష్టంగా వుంటోంది. నాకేమో ఎంత తలబద్దలు కొట్టుకున్నా ఎదురుగుండా వున్న మనిషెవరో గుర్తురాదు.

ఆయనది ఇంకోరకం మతిమరుపు. ఠక్కున గుర్తుపట్టేస్తారు. "అతనా! మన గోపాల్రావుగారి మనవడు కదా! ఆ అమ్మాయినెలా మర్చిపోయావు? మన సుశీల అన్నకూతురు" అని చెప్పేస్తారు. కానీ అంతా రాంగ్ ఐడెంటిటీ. నిజానికి గోపాల్రావు గారికి మనవడూ వుండడు. సుశీలకి అన్నా వుండడు. ఏవిటో అదో గొడవ.

కాబట్టి ఈ విషయంలో మేము ఒకరికొకరం సాయం చేసుకునే పరిస్థితి లేదు. సరే పోనీలే ఎవరో ఒకరు. ఎవరైతేనేం నోరారా పలుకరించింది అంతే చాలు అనుకున్నా.

నేనే కాదు. ఆయనా ముచ్చటపడ్డారా అమ్మాయిని చూసి.

"ఈ అమ్మాయి భాస్కరంగారి మేనకోడలు అనుకుంటాను. పిల్ల చిదిమి దీపం పెట్టుకునేలా వుంది. మా ఫ్రెండు రామసుబ్రహ్మణ్యం కొడుక్కి పెళ్ళి చెయ్యాలని తెగ వెతికేస్తున్నాడు. ఈ పిల్ల వివరాలు కనుక్కో" అన్నారు.

"అలాగే. దానికేం భాగ్యం" అన్నా.

అంతలోనే ఇంకో పిల్ల వచ్చింది. "అత్తయ్యగారూ! ఎంతసేపైంది వచ్చీ?" అంది. దీనిల్లు బంగారంగానూ ఈ పిల్లా చక్కగా వుంది. రామసుబ్రహ్మణ్యం గారబ్బాయికి ఆ పిల్ల కుదరకపోతే ఈ పిల్లనడగవచ్చు.

"మీ పిల్లలు రాలేదా?" అని అడిగింది. ఉలికిపడ్డాను. ఎంత మర్యాద? ఎంత పొందిక?

"వాళ్ళెక్కడొస్తారమ్మా. ఆఫీసులనుంచీ వచ్చేసరికే ఆలస్యం అయిపోతుంది కదా" అన్నాను.

"అవున్లేండి. అందులోనూ బోలెడంత దూరాలు. పోన్లెండి. వాళ్ళు రాకపోయినా మీరొచ్చారు" అంది. ఆ పక్కనే బాదం మిల్క్ అందిస్తున్న పిల్లాడిని కేకేసి మా ఇద్దరికీ ఇప్పించింది.

"కూర్చోండి అత్తయ్యగారూ, నేను మళ్ళీ వస్తా" అంది ఆప్యాయంగా.

"అలాగేనమ్మా. నువ్వెళ్ళీ పనిచూసుకో" అన్నాను.

"మరి పాపం వచ్చిన వాళ్ళందర్నీ పలుకరించాలా వద్దా?"

భానుమతి, ఆవిడ కుటుంబ సభ్యులు, ఎవరైనా కనిపిస్తారేమో అని చూశాను. ఎవరూ కనిపించలేదు. స్టేజీమీద మాత్రం తిరుపతి బ్రహ్మోత్సవాలలో గరుడ వాహనం ఊరేగింపులో లాగా ఇసకేస్తే రాలకుండా వున్నారు జనం.

సర్లే ముహూర్తం దగ్గర పడుతోందిగా. అక్కడున్నారేమో అందరూ అనుకుని ఇంకెవరైనా కనిపిస్తారేమో... అని చూశాను.

అక్కడక్కడా కనిపించారు తెలిసినవాళ్ళు. ఇప్పుడు లేచి జనాల్ని దాటుకుంటూ ఈ మూల నుంచీ ఆ మూలదాకా ఏం వెళ్తాం? ఎలాగూ అక్షింతలు వెయ్యడానికో భోజనానికో వెళ్తాం కదా అప్పుడు పలుకరిద్దాం అనుకున్నా.

ఇందాక పలుకరించిన పిల్లే వచ్చి మరోమారు నా మంచీ చెడ్డా కనుక్కుని వెళ్ళింది. హాల్లో ఆ మూల మరో ఇద్దరమ్మాయిలు అలాగే పలుకరిస్తున్నారు.

అప్పుడు గమనించాను. వాళ్ళంతా ఒకే రకం చీరెలు కట్టుకున్నారు. కాస్త అటూ ఇటూ ఒకే రకం నగలు. అందరికీ పొడవాటి జడ. నాకు అనుమానం

వచ్చింది. పక్కన కూర్చున్నావిడని అడిగాను. "ఆ పిల్లలంతా చుట్టాల పిల్లలా?" అన్నాను.

నవ్విందావిడ. "భలేవారే. ఈ రోజుల్లో చుట్టాలూ బీడీలూ ఎక్కడివీ? అంతా ఈవెంట్ మేనేజర్ వారి స్టాఫ్" అంది.

నాకు నీరసం వచ్చింది. "మరి అత్తయ్యగారూ అంటోందిగా" అన్నా.

"మేడమ్ అంటే బావుండదేమో అని అలా అంటున్నారేమో. మరి రోజు రోజుకీ కొత్త పద్ధతులు వచ్చిపడుతున్నాయిగా. బయట రిసీవ్ చేసుకున్న అమ్మాయి చూశారా ఎంత చక్కగా పలుకరించిందో వరస కలిపి" అందావిడ.

మన పిల్లేమో అని పెళ్ళిసంబంధం కూడా చూడబోతే ఆ పిల్ల పరాయిది అనేసరికి మనసు చివుక్కుమంది.

"కాఫీలూ, కూల్‌డ్రింకులూ అందించటం కాకుండా పలుకరింపులకీ పరాయివాళ్ళనే పెట్టారా? మరి అయినవాళ్ళంతా ఏమయ్యారు?" అని అడిగాను.

"ఈ రోజుల్లో అయినవారంటే వాళ్ళూ వాళ్ళ కుటుంబం. అంతేగా. అంతా స్టేజీ మీదే వున్నారు. ఇప్పుడు ఏదో కొత్త టెక్నాలజీ వచ్చిందిటగా. ఇక్కడ జరుగుతున్న పెళ్ళి వేడుకను ప్రపంచంలో ఎక్కడినుంచైనా లైవ్ చూడవచ్చుట. మరి ప్రతి ఇంట్లోనూ సగం మంది జనాభా విదేశాల్లోనే వున్నారాయె. వాళ్ళంతా చూడ్డానికి వీలుగా వీళ్ళ కుటుంబం అంతా పసిపిల్ల బాలాది స్టేజి మీదనే వున్నారు" అని వివరంగా చెప్పింది.

"బావుంది. ఎంచక్కా లైవ్ చూడొచ్చు, విదేశాల్లో వున్నవాళ్ళు. మరి పెళ్ళికి వచ్చినవారి మాటేమిటీ?" అన్నా.

"ఇది మరీ బావుంది. ఇక్కడున్నవాళ్ళం ఎక్కడికి పారిపోతాం? ఇక పెళ్ళి చూడ్డం అంటారా? అది ఏనాటి మాట? ఏ పెళ్ళికెళ్ళినా ఫోటోలు తీసేవారి వీపులు తప్ప వధూవరులను కళ్ళారా చూసే అవకాశం వుండదు కదా!" అన్నారు మా ఆయన.

"అవునండీ. ఇక ఆహ్వానాలూ భోజనాలూ అన్నీ ఈవెంట్ మేనేజర్లే చూసుకుంటారు" అంది పక్కావిడ.

మేము మాట్లాడుకుంటూ వుండగానే ఇందాకటి పిల్ల వచ్చింది. "భోజనాలు రెడీగా వున్నాయి. వస్తారా మామయ్యగారూ" అంది.

"వస్తాం పద కోడలా" అన్నారు మా ఆయన.

మరి ముహూర్తం అయ్యాక అక్షింతలు వెయ్యద్దా అంటే,

"భోజనం చేశాక కూడా వెయ్యచ్చు. ఇప్పుడే ముహూర్తం అయినట్లుంది. ఇప్పుడు అందరూ వెళ్ళి అక్షింతలు వేసేసరికి ఓ గంట పడుతుంది పద" అన్నారు. సరే అని వధూవరులను ఆశీర్వదించే పని వాయిదా వేసి భోజనాల హాలుకి వెళ్ళాం. అక్కడ అంతా వైభవంగా వుంది.

"రండి, రండి" అంటూ బొమ్మల్లా తయారైన ఆడపిల్లలూ, సూట్లేసుకున్న మగ పిల్లలూ నవ్వుతూ ఆహ్వానించారు. బఫే డిన్నరే. కానీ మధ్యలో అతిథులు కూర్చుని తినడానికి వీలుగా బల్లలూ కుర్చీలూ వేశారు.

వడ్డించుకుని వచ్చి కూర్చున్నాం.

"పిన్నిగారూ! ఏం తెమ్మంటారు? ఓ చపాతీ తీసుకు రమ్మంటారా? కొద్దిగా పప్పేసుకుంటారా?" అని వచ్చి అడిగింది ఓ పిల్ల.

"కావాలంటే మేము వెళ్ళి తెచ్చుకుంటాంలే అమ్మా! నువ్వూరికే శ్రమపడకు" అన్నా వినదే.

"ఎందుకు మీరెళ్ళటం? నాతో చెప్తే నేను తెచ్చి పెడతా" అంది నవ్వుతూనే.

"సరే అలాగే చెప్తాను. ముందు ప్లేట్లో వున్న పదార్థాలు తిననీ" అంటే వెళ్ళింది.

ఆ పిల్ల అటు వెళ్ళిందో లేదో ఇట్నుంచీ ఓ సూటు పిల్లాడొచ్చాడు.

"అమ్మా ఏం తెమ్మంటారు? సార్ మీకు? బజ్జీ తెమ్మంటారా? దొండ ఫ్రై తీసుకురానా? ఓ దహీ వడ తెచ్చిపెట్టనా" అంటూ భుజం మీద పడి పోయి అడిగాడు అతి మర్యాదగా.

ఇంకాసేపుంటే ఎదురుగా వున్న ప్లేట్లో పడిపోతాడేమో అని భయం వేసింది.

"ఇవి తిన్నాక రా నాయనా" అని తోలేశాం.

ఇటునుంచీ ఒకరిని తోలేసరికి అటునుంచీ ముగ్గురొస్తున్నారు కనుక్కోవడానికి.

వీళ్ళతోనే సరిపోయింది. ఇంకేం తింటాం? మేమే కాదు. భోజనం చేస్తున్న అందరి అవస్థా అలానే వుంది. మా టేబుల్ మీదనే ఓ అబ్బాయి కూర్చున్నాడు. మూడేళ్ళ పిల్లని వెంటబెట్టుకొచ్చాడు. తండ్రీ పిల్లా కూర్చున్నారు. అతనేదో వడ్డించుకొచ్చి కూతురికి తినిపించి తను మొదలు పెట్టాడో లేదో మర్యాద చేసేవాళ్ళొచ్చేశారు.

"సార్! బేబీకి పానీపూరీ తెమ్మంటారా? మీకు మామూలు పూరీ తెమ్మంటారా?" అని వెంటబడ్డారు. పాపం అతను వాళ్ళకి సమాధానం చెప్తుంటే ఆ పిల్ల కుర్చీ దిగి పారిపోతోంది. అటు కూతుర్నీ ఇటు వీళ్ళనీ సంభాళించుకోలేక సతమతం అయ్యాడా అబ్బాయి.

"ఇదెక్కడి గొడవ. వడ్డించాలంటే చక్కగా విస్తళ్ళేసి వడ్డించాలి. లేదూ బఫే అంటే మన ఇష్టానికి మనని వదిలెయ్యాలి. అటూ ఇటూ కాకుండా ఇదేం న్యూసెన్సు. వద్దు మొర్రో అన్నా వినరేం" అని బాహాటంగానే విసుక్కున్నాడు. అవును మరి. అతి సర్వత్ర వర్జయేత్. విసుక్కున్నా అవతలి వాళ్ళ మొహాల మీద చిరునవ్వు చెరగలేదు. విమానంలో ఎయిర్‌హోస్టెస్‌లాగా నవ్వుతూనే కాల్చుకుతింటున్నారు.

ఏదో కాస్త తినేసి బయటికొచ్చేశాం. స్టేజీమీద ఇంకా రద్దీగానే వుంది. హాల్లో జనం కాస్త పల్చబడ్డారు. కామాక్షి కలిసింది. ఆవిడా మాకు దూరపు బంధువే. భానుమతికి దగ్గర బంధువు. ఆవిడ పొద్దున్నే వచ్చింది. స్నాతకం ఎదురుకోలు, వరపూజ అన్నీ చూసింది. ఆ వివరాలన్నీ చెప్పింది. అంతా ఈవెంట్ మేనేజర్‌కే అప్పచెప్పేశారట.

ఇక అన్నీ వాళ్ళే చూసుకున్నారుట. పెళ్ళికూతురిని పల్లకీలో తీసుకొచ్చారుట. మేనమామా, బుట్టా లేవుట. తెరసెల్లా పట్టడం కూడా వాళ్ళేనుట. ఇద్దరాడ పిల్లలు జిగేల్ జిగేల్ మనేలా తయారై తెర పట్టుకున్నారుట.

వియ్యాల వారికిచ్చే ఫలహారాలు కూడా ఈ ఆడపిల్లలే పట్టుకొచ్చారుట. ఒకేరకం చీరెలు కట్టుకుని వయ్యారంగా నడుస్తూ వస్తుంటే కన్నుల పండుగగా వుందిట. ఇంకేమిటేమిటో చెప్పింది విన్నాను.

"పద స్టేజీమీద కాస్త ఖాళీ అయింది. వెళ్ళి అక్షింతలు వేసి వద్దాం" అన్నారాయన.

వెళ్ళాం. భానుమతి ఎంతో ఆదరంగా పలుకరించింది. "వచ్చేరా. చాలా సంతోషం" అంది.

"మీ అబ్బాయీ కోడలూ బావున్నారు" అన్నా.

"అంతా ఆ భగవంతుడి దయ. మీరు భోజనం చేశారా?" అంది.

"చేశాం" అన్నాం.

"సరే తాంబూలం తీసుకు వెళ్ళండి" అంది, చేతులు జోడించి.

ఇక జరగండయ్యా జరగాలి అని తిరుమలలో దేవుడిముందున్న వాళ్ళు చెప్పినట్టుగా చెప్తున్నారు. మరి వెనకాల క్యూలో జనం వున్నారుగా.

అలాగే అనేసి బయటికొచ్చేశాం.

గేటు దగ్గర మరి బంధువులో, ఈవెంట్ మేనేజ్‌మెంట్ వారో తెలియదు గానీ ఆడపిల్లలు ఓ కవరు అందించారు చిరునవ్వుతో.

బయటికొచ్చి కారెక్కాం.

ఆ పెళ్ళిగురించే ఆలోచన నాకు. దాంతోబాటు భవిష్యత్తు గురించి భయం.

అదివరకు ప్రతివారికీ బోలెడంతమంది బలగం వుండేవాళ్ళు. ఆ తరువాత మామూలప్పుడు ఎవరికివారే యమునాతీరే అన్నట్లు వున్నా పెళ్ళిళ్ళకీ పేరంటాలకీ పదిమందీ వచ్చి వాలిపోయేవారు. తలోపనీ నెత్తినేసుకుని చేసేవారు. ఆ తర్వాత అదీ పోయింది. అయినవాళ్ళూ అన్నదమ్ములే తలోమూలా చెల్లాచెదరై పోయారు. గతంలో అయితే పెద్దవాళ్ళకి ఓపిక తగ్గేసరికి పిల్లలు అంది వచ్చేవారు.

ఇప్పుడసలు పిల్లలేరీ? సగమందికి పైగా విదేశాలకి వెళ్ళిపోయారు. ఇక్కడున్న వాళ్ళకి అసలు తీరికలుండటం లేదు. ఉద్యోగాలూ, వత్తిళ్ళూ, పిల్లలూ ఒకటి కాదు. వాళ్ళు పెళ్ళికి వచ్చినా నీటుగా ముస్తాబులై వాళ్ళ పిల్లలని సమర్థించుకోడానికే టైం సరిపోవడం లేదు. ఇక పెద్దవాళ్ళకి సాయం చేసే అవకాశం ఏదీ?

నడివయసు వాళ్ళకి బోలెడన్ని ఆరోగ్యపరమైన సమస్యలు. నడుం వంగితే కాళ్ళొంగవు. కాళ్ళొంగితే నడుం వంగదు. యాభై దాటాక కింద కూర్చోగలిగిన భాగ్యశాలి ఒక్కరైకూడా వుండడం లేదు.

ఇక వృద్ధులున్నారంటే వాళ్ళు సణగటానికి తప్ప ఇంకెందుకు పనికొస్తారు పాపం?

ఇన్ని కారణాల వల్ల జనాభా పెరిగింది గానీ అండగా వుండేవాళ్ళు అరుదై పోయారు. అందుకే వంటమనిషిని, డ్రైవరునీ పెట్టుకున్నట్లు ఈవెంటు మేనేజర్లు అని డబ్బు తీసుకుని పనిచేసి పెట్టేవారికి పని అప్పచెప్పి అమ్మయ్య అనుకోటం అలవాటైపోయింది.

మొదట్లో ఏ వడ్డనకో పనివారిని పెట్టుకున్నా వచ్చినవాళ్ళని పలుకరించటం, ఆదరించటం అన్నీ ఇంటివాళ్ళే చూసుకునేవాళ్ళు.

"రాన్రాను రాజుగారి గుర్రం గాడిద అయిపోయింది" అన్నట్లు మరీ అన్ని బాధ్యతలూ వారికే అప్పగించేస్తున్నారు.

పానీయాలు, ఫలహారాలు, భోజనాలు అందించడం సరే, గేటు దగ్గర నిలబడి ఆహ్వానించడం మర్యాదలూ, మన్ననలూ కూడా బయటవాళ్ళేనా? మరీ ఆవాహన దగ్గర్నుంచీ ఉద్వాసన దాకా అన్నీ బయట వాళ్ళకే పురమాయించేస్తుంటే, అదేవిటో-హోటలుకెళ్ళి భోజనం చేసి వచ్చినట్లుగా వుందిగానీ పెళ్ళికెళ్ళినట్లే లేదు. అయినవాళ్ళకున్న ఆప్యాయత బయటవాళ్ళకుండదుగా. అంతా మొక్కుబడి వ్యవహారం.

ఇప్పటికే ఇన్ని మార్పులొచ్చేశాయి. మరి ముందు ముందు ఇంకెన్ని మార్పులొస్తాయో. ఇదసలే పోటీ ప్రపంచం. ప్రతిచోటా పోటీలే. ఇప్పుడీ ఈవెంట్ మేనేజ్‌మెంట్ విషయంలోనూ అంతే.

ఈ పెళ్ళిలోనే మార్పు చాలా స్పష్టంగా కనిపించింది.

ఈవెంట్ మేనేజ్‌మెంట్ వాళ్ళే ఇంటివాళ్ళలాగా వరసలు పెట్టి చిలక పలుకులు పలుకుతూ మర్యాదలు చేశారు. ఈ మర్యాద కూడా వాళ్ళ చేతుల్లోకి వెళ్ళిపోవడం అంత శుభసూచకం కాదు.

ఇదిలాగే కొనసాగి ప్రస్తుతం పెళ్ళి భోజనానికి ప్లేటుకి ఇంత అని ఛార్జ్ చేస్తున్నట్లే, ఈవెంట్ మేనేజర్లకి మనిషికింత మర్యాదకి అని చెప్పి దీన్ని కూడా వారికి అప్పగించేస్తే అతిథుల గతి అధోగతే.

అయినవాళ్ళు ఆప్యాయంగా మర్యాద చేస్తే అది అందం, ఆనందంగానీ బయటవాళ్ళు డబ్బు తీసుకుని దానికి తగిన విధంగా మర్యాద చేస్తే అఘోరించినట్లే

వుంటుంది. ఈ రోజుల్లో ఎవరికీ డబ్బుకి కొదవలేదు. ఎంతైనా ఖర్చు చేసి పెళ్ళి చెయ్యగల సత్తావుంది. కాబట్టి ఇప్పుడు మెగా మీల్స్ అని అరవై ఆరు ఐటమ్స్ పెట్టి పెళ్ళి విందు చేస్తున్నట్లు, మాకు తీరదు మరోపాతికమందిని ఎక్స్‌ట్రాగా పెట్టైనా సరే వచ్చిన వాళ్ళందరికీ మెగా మర్యాదలు చెయ్యమని అందుకు అనుగుణంగా రేట్లు మాట్లాడుకుంటే ఇక చెప్పేదేముంది? వాళ్ళు రెచ్చిపోయి అతిథులని ఫుట్‌బాల్ ఆడేసుకుంటారు.

అతిథులకి దగ్గరుండి వడ్డించి వాళ్ళొద్దంటే, చావగొట్టి చెవులు మూసి మరీ మర్యాద చేస్తారేమో! అతిథుల పిల్లలని వాళ్ళేడుస్తున్నా వినకుండా చంకనేసుకుని అన్నాలు పెట్టి చెయ్యీ, మూతీ కడిగించి అమ్మా నాన్నలకి అప్పగిస్తారేమో!

మరి భారీగా డబ్బు పుచ్చుకున్నప్పుడు మర్యాదలూ భారీగానే వుండాలి కదా! కాకపోతే ఆ మర్యాదలను తట్టుకునే శక్తి అతిథులకుండాలి.

ఇప్పటికే ఎవరైనా శుభలేఖ చేత్తోపుచ్చుకుని పెళ్ళికి పిలవడానికి గుమ్మంలోకి వస్తేనే హతవిధీ మళ్ళీ పెళ్ళికెళ్ళాలా అని దిగులు పడుతున్న జనాలు, ఈ మర్యాదల గొడవకి తట్టుకోలేక వంకలు వెతుక్కుని అసలు వెళ్ళడమే మానేస్తారేమో! ❑

*ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక, 1, అక్టోబర్ 2013*